## క్లుప్తంగా

### ఉత్తమ అవార్డుకు మూడు పాఠశాలల ఎంపిక

**దెందులూరు:** ఏలూరు జిల్లాలో 2023–24 విద్యా సంవత్సరంలో రాష్ట్ర, జిల్లాస్థాయిలో నిర్వహించిన క్రీడాపోటీల్లో పాల్గొని పతకాలు సాధించడంతోపాటు ఇతర అంశాల్లో ప్రగతి ఆధారంగా దెందులూరు నియోజకర్గం పరిధిలో మూడు పాఠశాలలను ఉత్తమ అవార్డుకు ఎంపిక చేశామని జిల్లా విద్యాశాఖాధికారి డి. అబ్రహం తెలిపారు. పెదవేగిలో ఏపీడబ్ల్యూఎస్ఆర్ఎస్, ఏలూరు రూరల్ మండలం పోణంగి, పెదపాడు మండలం కలపర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలను ఎంపిక చేశామన్నారు. ఉత్తమ పాఠశాలలగా ఎంపికైన ఆయా పాఠశాలల హెచ్ఎంలు, విద్యార్థులు హర్షం వ్యక్తంచేశారు.

### అర్హులైన పేదలకు 3 సెంట్ల ఇళ్ల స్థలం

**దెందులూరు:** నియోజకవర్గంలో అర్హులైన పేదలకు 3 సెంట్లు ఇళ్ల స్థలం ఇస్తామని పేదల సొంతింటి కలను సాకారం చేస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం నుంచి వివిధ గ్రామాల నుంచి పేదలు ఎమ్మెల్యేను కలిసి ఇంటి స్థలం కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థలం, ఇల్లు లేదని ఏ ఒక్కరూ బాధపడనవసరం లేదని క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

### కొల్లేరు సంతోషిమాత ఆలయంలో రాఖీ పౌర్ణమి

**ఏలూరు రూరల్:** రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం కొల్లేరు గ్రామం మొండికోడులో సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు పరివేక్షణంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తుల కోసం టెంట్లు, తాగునీరు తదితర సౌకర్యాలు సిద్ధం చేశారు. ఏటా కొల్లేరు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో శ్రీసంతోషిమాతను దర్శించుకుంటారు. అమ్మవారి సమక్షంలో చెల్లెల్లు, అక్కలు అన్నదమ్ములకు రాఖీలు కడతారు. భక్తుల కోసం గ్రామస్తులు అన్నదానం నిర్వహిస్తారు.

### వాకర్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**ఏలూరు రూరల్ :** స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఏఎస్ఆర్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్, వాసవి సుబ్బారావు, సీతారాజ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరానికి డాక్టర్ నంబూరి రాఘవరామ్ తన వైద్య సిబ్బందితో కలిసి సేవలందించారు. పలువురు వాకర్స్‌కు బీపీ, సుగర్, గుండె తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. పలువురికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం అక్బర్, జగదీష్, ప్రత్తిపాటి నాగవిగ్నేష్, ఎల్ఎన్ జగదీష్, జంపా సూర్యనారాయణ, విశ్వనాథ్, మాధవరావు, ఎస్‌కే లాల్‌సాహెబ్, జీఏ గుప్తా పాల్గొన్నారు.

### ఫైళ్ల దహనం ఘటనలపై సమగ్ర విచారణ చేయాలి

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** పోలవరం ప్రాజెక్ట్ పరిపాలన కార్యాలయంలో ఫైల్స్ దగ్ధం చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి కోరారు. ఇటీవల కాలంలో ఫైల్స్ దగ్ధం వార్తలు తరచూ వినిపిస్తున్నాయని, వాటిలో వాస్తవాలేమిటనేది ప్రభుత్వం తేల్చాలని పేర్కొన్నారు.

### మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తేవాలి

**ఏలూరు(మెట్రో):** కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ దారుణ హత్యను ఉమ్మడి పశ్చిమగోదావరి ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్, మహిళా విభాగం ఆదివారం తీవ్రంగా ఖండించింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళల కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో మహిళలు, టీనేజీకి వచ్చిన బాలికలు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు, గంజాయికి బానిసలు కాకుండా మగ పిల్లలకు తల్లిదండ్రులు కౌన్సెలింగ్ చేయాలని సూచించారు. ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, మహిళా విభాగం సభ్యులు కె.నాగమణి, డి.నాగదేవి, టి.కుసుమ కుమారి, కె.సునీత ఉన్నారు.

### ఇస్కాన్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఈ నెల 26న అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఏలూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో నిర్వహించిన వివిధ పోటీల్లో పాఠశాల, కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకూ చిత్రలేఖన పోటీలు, ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకూ వ్యాస రచన పోటీలు నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని ఇస్కాన్ ఏలూరు శాఖ ప్రతినిధి రాధా వల్లభ దాస్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారిలో విజేతలను ఈ నెల 26న ప్రకటించి, అదే రోజు నిర్వహించే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తామన్నారు.

# ఆప్యాయతకు ప్రతీక రక్షాబంధన్


- మార్కెట్‌లో వివిధ డిజైన్లతో రంగుల రాఖీలు
- కొనుగోలుకు తరలివచ్చిన తోబుట్టువులు
- నేడు రాఖీ పౌర్ణమి


**దెందులూరు:** అన్నా, చెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ల ఆత్మీయతకు ప్రతిరూపంగా నిర్వహించుకునేదే రాఖీ పండుగ లేదా రక్షా బంధన్. 19వ తేదీ సోమవారం శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమి తిథి కావడంతో రాఖీ పౌర్ణమిని తోబుట్టువులు ఆనందోత్సాహాలతో వైభవంగా జరుపుకునేందుకు దెందులూరు నియోజకవర్గ వ్యాప్తంగా బాలల నుంచి పెద్దవాళ్ల వరకూ అందరూ సిద్ధమవుతున్నారు. అక్కాచెల్లెళ్లు కట్టిన వివిధ రంగులు, డిజైన్ల రాఖీలతో సోదరుల చేతులు కళకళలాడనున్నాయి. అండగా ఉంటామని హామీ ఇస్తూ అన్నదమ్ములు తమకు తోచిన కానుకల సోదరీమణులకు ఇస్తారు. రక్షా బంధన్‌ను రాఖీ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమిగా పిలుస్తారు. విద్యార్థినీ విద్యార్థులు, యువతీ యువకుల మధ్య సోదర భావం, నైతిక విలువలు పెరిగేందుకు ఇది దోహద పడుతుంది. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ పెరుగుతున్న పరిస్థితుల్లో కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాలు ఈ పండగను ఘనంగా నిర్వహించేందుకు చొరవ చూపాలి.



విక్రయానికి సిద్ధంగా ఉన్న రాఖీలు







**మార్కెట్‌లో ఆకర్షిస్తున్న రంగురంగుల రాఖీలు**

రాఖీ పండుగను పురస్కరించుకుని మార్కెట్‌లోని పలు ఫ్యాన్సీ షాపుల్లో సంప్రదాయ, ఆధునిక రాఖీలు కనువిందు చేస్తున్నాయి. వ్యాపారులు రంగురంగుల రాఖీలను అమ్మకాలకు పెట్టారు. ముఖ్యంగా పిల్లలను ఆకర్షించే విధంగా కామిక్ రాఖీలను ఎక్కువగా విక్రయిస్తున్నారు. మరికొన్ని బంగారు బ్రాస్‌లెట్‌లను తలపిస్తూ దగదగలాడుతున్నాయి. రుద్రాక్ష, ప్లాస్టిక్, పూల రాఖీలు, వెండి, రంగు పూసల రాఖీలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఇవి కాలానుగుణంగా కొత్త డిజైన్లలో వస్తున్నాయి. గతంతో పోల్చితే విక్రయాలు పెరుగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. రూ.10 నుంచి వేల ధరల్లో లభ్యమవుతున్నాయి.

### మహిళలకు అతి ముఖ్యమైన పండుగ



మహిళలందరికీ ఎంతో ప్రాముఖ్యమైన పండుగ రాఖీ పౌర్ణమి. సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షణతో పాటు కుటుంబ బంధాలు బలపడానికి ప్రేమ, ఆత్మీయత, అనుబంధానికి ఈ పండుగ లక్ష్యం. రక్షా బంధన్ అక్కాచెల్లెళ్లు, అన్నాదమ్ములు ఎంతో సంతోషించే పండుగ.

– గంటా పద్మశ్రీ, జెడ్పీచైర్‌పర్సన్

### తోబుట్టువులకు ఆనందం



రక్షా బంధన్ రోజున తప్పని సరిగా సోదరుడికి రాఖీ కట్టి తోబుట్టువులు ఆనందం పొందుతారు. సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం విపరీతంగా పెరగడంతో రోజులు గడిచే కొద్దీ ప్రేమానురాగాలు, కుటుంబ బంధాలు, మానవతా విలువలు తగ్గుముఖం పట్టాయి. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం భవిష్యత్తులో కుటుంబ బంధాలపై కూడా ప్రభావం చూపుతుంది.

– సౌభాగ్యం, గృహిణి

### అనుబంధాన్ని పెంపొందిస్తుంది



అక్క చెల్లెళ్లకు రక్షగా నిలిచి, భరోసా ఇచ్చేది అన్నదమ్ములే. తండ్రి తరువాత సోదరిపై అంతటి బాధ్యత, బంధం అన్నదమ్ములకే సృష్టిలో ఉంది. అక్క చెల్లెళ్లు, అన్నదమ్ముళ్ల మధ్య అనుబంధాన్ని పెంచేది పండుగ రాఖీ పౌర్ణమి.

– జీ. వెంకట్, దెందులూరు

### రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాట్నాలమ్మ తల్లి

**పెదవేగి :** రాట్నాలమ్మ అమ్మవారికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వేంచేసిన మహిమ గల తల్లి రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచి అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్ల ద్వారా రూ.36,560, విరాళాలు రూ.35,287, లడ్డూ ప్రసాదంపై రూ.18,720, ఫొటోల విక్రయంతో రూ.4,135, మొత్తం రూ.94,702 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ చెప్పారు. రాట్నాలమ్మ అమ్మవారికి విరాళాలు వెల్లువెత్తాయి. ఆదివారం పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి చెందిన పామర్తి సీతారామయ్య, నాగేంద్రమ్మ దంపతులు, లక్ష్మీదుర్గ, సాయి మేఘనలు రాట్నాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.31,000 విరాళంగా అందించారు.

### యువకుడిపై పోక్సో కేసు

**ఏలూరు టౌన్:** ఏలూరు శనివారపుపేట ప్రాంతానికి చెందిన ఒక విద్యార్థినిని ప్రేమించాలంటూ వేధింపులకు పాల్పడుతున్న యువకుడిపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. శనివారపుపేట ప్రాంతానికి చెందిన పదవ తరగతి విద్యార్థినిని లంకపల్లి విష్ణు అనే యువకుడు ప్రేమించాలంటూ వేధిస్తూ ఉండడంతో బాధిత బాలిక తల్లి ఫిర్యాదుతో ఏలూరు త్రీటౌన్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మాజీ ఎమ్మెల్యే కొఠారును కలిసిన జెడ్పీ ఛైర్‌పర్సన్

**దెందులూరు:** వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని ఆదివారం రాయన్నపాలెంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, వైస్ ఛైర్మన్ పి.విజయ్‌బాబు, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, జెడ్పీటీసీ సభ్యులు మండలి సరస్వతి, నిట్టా లీలానవకాంతం, బత్తిన రత్నకుమారి, ఎంపీపీలు తాతా రమ్యశ్రీ, బొమ్మనబోయిన సుమలత, పెన్మెత్స శ్రీనివాసరాజు, చల్లగొళ్ల తేజ, ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరాఆనంద్, ఫారెస్ట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు పశ్లెం ప్రసాద్, మండలి కొండలరావు, ప్రభాకరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నిట్టా గంగరాజు, బత్తుల ఏసురాజు, గొల్ల కిరణ్, గొల్లా వీరాస్వామి, దెందులూరు ఏఎంసీ మాజీ ఛైర్మన్‌కాటి సుధాకర్, నాలుగు మండలాల అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు కలిసినవారిలో ఉన్నారు.



రాయన్నపాలెంలో మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని కలిసిన జెడ్పీ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

## హైకోర్టు ఏజీపీ నీలోత్పల్‌కు సత్కారం



దెందులూరు నర్సింగ్ కళాశాలలో హైకోర్టు ఏజీపీగా ఎంపికైన గంజి నీలోత్పల్‌కు పౌర సన్మానం చేస్తున్న దృశ్యం

**దెందులూరు:** దెందులూరు గ్రామానికి చెందిన గంజి వెంకట్రావు, సువర్చలాదేవి కుమారుడు గంజి నీలోత్పల్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ఏజీపీగా నియమితులు కావడం దెందులూరు గ్రామ, మండలానికి స్ఫూర్తిదాయకమని నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. ఆదివారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో ఏజీపీకి పౌరసన్మానం చేశారు. రెండవ వార్డు నుంచి పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. నేటి యువత నిలోత్పల్‌ను ఆదర్శంగా తీసుకుని ఎంచుకున్న రంగాల్లో లక్ష్యాలు సాధించాలన్నారు. సన్మాన గ్రహీత ఏజీపీ మాట్లాడుతూ తాను ఈ రోజు రాష్ట్ర హైకోర్టుకు ఏజీపీగా నియామకం పొందడానికి తన తల్లిదండ్రుల కృషి, ప్రోత్సాహం, సహకారం ప్రధాన కారణమన్నారు. దెందులూరు తరఫున పౌర సన్మానం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొడాలి ఆంజనేయ చౌదరి, మొటపర్తి రాజా, దేవినేని తులసీదాసు, మేడిది నికోలా, మద్దిపాటి వెంకట్రాది, సంపంగి వేణుగోపాల్ తిలక్ పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థిని హత్యచేసిన వారిని శిక్షించాలి

**గణపవరం:** మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు చేసినా ఆచరణలో వారిని రక్షించలేక పోతున్నాయని పలువురు అన్నారు. మహిళలపై దాడులు, దౌర్జన్యాలు జరగకుండా కఠినంగా వ్యవహరించాలని కోరారు. కల్‌కతాలోని ఆర్‌జీ మెడికల్ కాలేజీలో పీజీ వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ఉండాలంటే నిందితులకు ఉరి శిక్ష వేయాలని కోరుతూ ఆదివారం గణపవరం, నిడమర్రు మండలాల పీఎంపీ అసోసియేషన్లు, మానవత, లయన్స్ క్లబ్ తదితర స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఆందోళన నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. ఇటీవలి వైద్యులపై దాడులు పెరిగిపోయాయని, ముఖ్యంగా మహిళా వైద్యులపై వేధింపులు ఎక్కువయ్యాయని ఐఎమ్‌ఏ సభ్యుడు ఉప్పలపాటి రాజు ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యుల చేస్తున్న ఆందోళనకు తమ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

**వైద్యురాలు హత్యకు నిరసనగా ర్యాలీ**

**దెందులూరు:** కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను దారుణంగా హత్య చేసిన నిందితులను ఇప్పటి వరకు పట్టుకోకపోవడానికి నిరసనగా ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ, నిరసన చేశారు. జిల్లా, మండల, నియోజకవర్గ, గ్రామాల నాయకులు నిందితులను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించి నిందితులను అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తొలుత ఎంఆర్‌పీఎస్ నిరసనకు, ర్యాలీకి గోపన్నపాలెం సీహెచ్‌సీ వైద్యాధికారి, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు మద్దతు తెలిపారు.

**పీఎంపీ అసోషియన్ ఖండన**

**ఉంగుటూరు:** కల్‌కతాలో డ్యూటీలో ఉన్న పీజీ వైద్య విద్యార్థినిని అమానుషంగా హత్యచేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని పీఎంపీ అసోషియన్ ఉంగుటూరు మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సాయంత్రం చేబ్రోలు పీహెచ్‌సీ వద్ద అసోసియేషన్ సభ్యులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. దేశవ్యాప్తంగా డాక్టర్లు చేస్తున్న నిరసనకు సంఘీభావం తెలుపుతున్నామని అన్నారు. నల్లబ్యాడ్జీలు ధరించి చేబ్రోలులో నిరసన ర్యాలీ నిర్వహించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



గోపన్నపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు



గణపవరంలో నిరసన తెలుపుతున్న పీఎంపీ, స్వచ్ఛంద సంస్థల సభ్యులు



చేబ్రోలు పీహెచ్‌సీలో నిరసన తెలుపుతున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

### డాక్టర్ చార్లెస్‌కు ఘన సత్కారం

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** తెలుగు రాష్ట్ర ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను విదేశీయులకు తెలపడం కోసం 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 15 మంది ఉపాధ్యాయులను అమెరికా పంపింది. వారిలో నగరానికి చెందిన డాక్టర్ చార్లెస్ అక్కడ విధులు ముగించుకుని ఆదివారం నగరానికి వచ్చారు. స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యే బడేటి చంటిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే చంటి డాక్టర్ చార్లెస్‌ను ఘనంగా సత్కరించారు.

## కంటి వ్యాధులపై నిర్లక్ష్యం తగదు

**గణపవరం:** కంటి సమస్యలను చాలామంది ఎక్కువగా నిర్లక్ష్యం చేస్తారని, ఇది చాలా ప్రమాదకరమని ప్రముఖ కంటి శస్త్రచికిత్సా నిపుణుడు యూజే రాజు అన్నారు. ఆదివారం గణపవరంలో మీనాక్షి కంటి వైద్యశాల, గణపవరం పీఎంపీ అసోసియేషన్, గణపవరం మెడికల్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో కంటి సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే చూపు కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. కంటికి గాయాలయితే వెంటనే నేత్ర వైద్యులను సంప్రదించాలన్నారు. పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించడం అభినందనీయమని అన్నారు. వైద్యసేవలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. మెడికల్ యూనియన్ అధ్యక్షుడు సుబ్బ రాజు మాట్లాడుతూ ప్రస్తుత కలుషిత వాతావరణంలో కంటి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని, కంటి సంరక్షణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యావేత్త సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరకు కంటి శస్త్రచికిత్సలు, కళ్లజోళ్లు అందుబాటులో ఉంచాలని కోరారు. మానవత జిల్లా నాయకుడు పుప్పాల గోపి, బుద్ధారపు పుల్లయ్య, లయన్స్‌క్లబ్ సభ్యులు వెల్లంకినరేష్, కిలారి రవి, పోశింశెట్టి రామ్మూర్తి, గణపవరం, నిడమర్రు మండలాల పీఎంపీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.



కంటి సమస్యలను వివరిస్తున్న వైద్య నిపుణుడు రాజు

# అంతర పంటలు.. లాభాల గుబాళింపు

- వక్క, మిరియాలు, తమలపాకు సాగుతో ఆర్థిక పరిపుష్టి
- ఏపీలో కొబ్బరిసాగు విస్తీర్ణం గోదావరి జిల్లాల్లోనే అధికం
- దెందులూరు నియోజకవర్గంలో అంతర పంటల సాగుకు మొగ్గు

**పెదవేగి :** అంతర పంటల సాగుకు కొబ్బరి తోటలను రైతుల పాలిట కల్పతరువుగా చెప్పవచ్చు. కొందరు రైతులు అంతర పంటల పట్ల అవగాహన లేకపోవడంతో ఎంతో ఆదాయాన్ని కోల్పోతున్నారు. పాక్షిక నీడ నిచ్చే కొబ్బరి తోటలో ఎన్నో రకాల వాణిజ్య పంటలను సాగు చేసుకోవచ్చు. ఇది రైతుకు అన్నివిధాల కలిసొచ్చే అంశం. ఏపీలో కొబ్బరి సాగు విస్తీర్ణం గోదావరి జిల్లాలో అత్యధికం. అధిక వర్ష పాతం, గాలిలో తేమ శాతం అధికంగా ఉండే కోస్తా జిల్లాలు కొబ్బరి పెరుగుదలకు అనుకూలంగా ఉంటాయి. రాష్ట్రంలో కొబ్బరి మొత్తం విస్తీర్ణంలో 50 శాతం పైగా గోదావరి జిల్లాల్లోనే ఉంది. కొబ్బరిలో అంతర పంటల సాగుకు సైతం అన్నదాతలు మొగ్గుచూపుతున్నారు. ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో అంతర పంటల సాగుకు అన్నదాతలు మక్కువ చూపి అధిక ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. సంప్రదాయ పంటల కన్నా భిన్నంగా అంతర పంటలు కాసుల పంట పండిస్తుండటంతో రైతన్నలు వీటి సాగువైపు అడుగులు వేస్తున్నారు. కొబ్బరిలో కోకో, వక్క, మిరియం, అల్లం, పసుపు, దాల్చిన చెక్క వంటివి సాగు చేస్తున్నారు. అంతర పంటల ద్వారా నీటి యాజమాన్యం, ఎరువుల ఆదా జరుగుతుండటంతో పాటు ఆదాయం అధికంగా వస్తుంది. కొబ్బరిలో ఎకరాకు 200 నుంచి 500 మొక్కల వరకు మూడు మీటర్ల దూరంతో వక్క మొక్కలు నాటుకోవచ్చని ఉద్యాన వన అధికారులు సూచిస్తున్నారు. దెందులూరు నియోజికవర్గంలో 12 వేల ఎకరాల్లో కొబ్బరి ఉండగా అందులో 8వేల ఎకరాల్లో కోకో అంతర పంటగా ఉంది. నియోజకవర్గంలో 500 ఎకరాల్లో ఎక్కువ అంతర పంటల సాగు చేస్తున్నారు.



లక్ష్మీపురంలో కొబ్బరి తోటలో వక్క, మిరియాలు, తమలపాకు పాదులను అంతర పంటలుగా సాగు చేస్తున్న దృశ్యం



మిరియాలు, వక్క తోటలో పసుపు అంతర పంటగా సాగు చేస్తున్న దృశ్యం

**ఆర్గానిక్ పద్ధతిలో అంతర పంటల సాగు**

ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఉప్పలపాటి చక్రవాణి 13 ఏళ్లుగా ఆర్గానిక్ పద్ధతిలో అంతర పంటలను పండిస్తున్నారు. కొబ్బరిలో అంతర పంటలుగా మిశ్రమ పంటలుగా వక్క, మిరియాలు, పసుపు అల్లం సైతం సాగు చేస్తున్నారు. తోటలో 2,500 వక్క చెట్లు ఉండగా 700 చెట్లకు 2 టన్నుల ఎండు కాయల దిగుబడి రాగా వాటిని విక్రయించగా రూ.3.80 లక్షల ఆదాయం వచ్చిందని రైతు చక్రపాణి తెలిపారు. అంతర పంటగా కొబ్బరిలో 300 చెట్లకు మిరియాల సైతం సాగు చేయగా 200 చెట్లు కాపు కాస్తున్నాయని ఆయన అంటున్నారు. కేజీ 600 చొప్పున విక్రయిస్తున్నామని రైతు చక్రపాణి స్పష్టం చేస్తున్నారు. కొబ్బరిని సైతం సోలార్ డ్రయర్ల ద్వారా కొబ్బరి నూనె తయారు చేస్తున్నామని తెలిపారు. తాము తయారు చేసిన కొబ్బరి నూనెను వంటల్లోనూ వినియోగిస్తున్నామని తెలిపారు. అంతేకాక సిలోన్ వెరైటీ దాల్చిన చెక్కను సాగు చేస్తున్నామని ఆయన తెలిపారు.

### రైతులకు అధిక ఆదాయం



తక్కువ వ్యవసాయ క్షేత్రంలో ఎక్కువగా పంటలు పండించడం వల్ల రైతులకు అధిక ఆదాయం వస్తుంది. ఆయిల్‌పామ్, కొబ్బరి తోటల్లో ఎక్కువగా అంతర పంటలు పండిస్తూ పెదవేగి మండలంలో రైతులు ఆదాయం పొందేలా సబ్సిడీలు సైతం ప్రభుత్వం అందజేస్తోంది. గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాల ద్వారా వారికి పంటల సస్యరక్షణకు అవగాహన కల్పిస్తూ ఫీల్డ్ విజిట్ చేస్తున్నాం.

– ఎం రత్నమాల, ఉద్యాన అధికారి, పెదవేగి మండలం